ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 22 జనవరి 2024 | 5



నేడు యథావిధిగా 'స్పందన'

కాకినాడ సిటీ, జనవరి 21: జగనన్నకు చెబుదాం.. జిల్లాస్థాయి స్పందన ప్రజావిజ్ఞాపనల స్వీకారణ కార్యక్రమం సోమవారం ఉదయం 9.30గంటలనుంచి కాకినాడ కలెక్టరేట్ స్పందన హాల్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు, అర్జీదారులు గమనించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో సూచించారు.

జై శ్రీరామ్!

- శ్రీరామ నామస్మరణతో మార్మోగిన చేబ్రోలు
- అయోధ్య రామ శోభాయాత్రకు భారీగా తరలివచ్చిన భక్తులు

జై శ్రీరామ్.. జై శ్రీరామ్ నినాదాలతో జగమంతా ఊగిపోయింది.. అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచే జగమంతా పండుగలా మారింది.. ఎవరి నోటా విన్నా అదే మాట.. ఎక్కడ చూసినా అదే పాట.. జైశ్రీరామ్



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో అయోధ్యరామ శోభాయాత్రలో పాల్గొన్న భారీ భక్తజన సందోహం

గొల్లప్రోలు రూరల్, జనవరి 21: గ్రామమంతా వీధుల్లోకి తరలివచ్చింది. రహదారులన్నీ భక్తజన సంద్రమయ్యాయి. శ్రీరామనామస్మరణతో ఊరంతా మార్మోగింది. పురుషులు, మహిళలు, చిన్నారులు అనే భేదం లేకుండా అందరూ భాగస్వాములయ్యారు. అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆదివారం నిర్వహించిన శోభాయాత్రకు భక్తజనం పోటెత్తారు. భక్తులతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. సీతారామస్వామి దేవస్థానం చుట్టూ ప్రదిక్షణాలు చేసి పురవీధుల్లోశోభాయాత్ర చేశారు. చేబ్రోలులోని 15ఆలయాలు, రామకోవెళ్లను సందర్శించారు. తప్పెటగుళ్ల, చెట్టుభజనలు,శూలాలసంబరం, దేవతామూర్తుల వేషధారణలతో యాత్ర సాగింది.



కాకినాడలో 500 మోటరుసైకిళ్లతో రామ భక్తుల ర్యాలీ

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 21: శ్రీరామజన్మభూమి అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కాకినాడ నగరంలో రామ భక్తులు 500 బైక్‌లతో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ భానుగుడి అయ్యప్పస్వామి గుడినుంచి ప్రారంభమై సర్పవరం జంక్షన్ వెంకట్‌నగర్, వైఎస్‌ఆర్‌బ్రిడ్జి, కల్పనసెంటర్, గార్ల్స్ హైస్కూల్ రోడ్డు మీదుగా తిరిగి భానుగుడి చేరుకున్నారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సిటీ అధ్యక్షుడు టీఎస్‌ఎస్ ఆదిత్యశర్మ, బీజేపీ కాకినాడ జిల్లా ఇన్‌చార్జి చిలుకూరి రామ్‌కుమార్, పార్టీ నాయకులు మాలకొండయ్య, గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.





చేబ్రోలులో శ్రీరాముడు, లక్ష్మణుడు, సీతాదేవి వేషధారణలో చిన్నారులు



కాకినాడలో శ్రీరాముడి వేషధారణలో ఆకట్టుకుంటున్న చిన్నారి

ఆగి ఉన్న వాహనాలతో.. ప్రమాదాల భయం

- జాతీయ రహదారులపై రోడ్డు మార్జిన్ పక్కనే యథేచ్ఛగా వాహనాల పార్కింగ్
- నిర్లక్ష్యంగా హోటల్ యజమానులు, డ్రైవర్లు
- అర్ధరాత్రి దాటినా తెరిచి ఉంచుతున్న హోటళ్లు
- ఆకస్మిక దుర్ఘటనలతో రోడ్డు ప్రమాదాల్లో మరణాలు
- ప్రమాదాలు కట్టడి చేయాలంటున్న ప్రయాణికులు



తునిరూరల్ తేటగుంటలోని ఓ హోటల్‌వద్ద రోడ్డుపై నిలిపివేసిన వాహనాలు

తుని రూరల్, జనవరి 21: జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారిని ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా అడ్డుగోలుగా ఏర్పాటైన హోటల్స్ యజమానుల నిర్వాకం, డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రయాణికుల ప్రాణాలు బలిగొంటుంది. జాతీయ రహదారిపైనుంచి వేలాది వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. రహదారి వెంబడి ఉన్న హోటల్స్, దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా 24గంటలూ, అర్ధరాత్రి కూడా డ్రైవర్లకు అందుబాటులో ఉంటున్నాయి. సంబంధిత హోటల్ నిర్వాహకులు వాహనాలకు పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాల్సి ఉన్నా అవి చాలాచోట్ల కానరావడం లేదు. ఫలితంగా వాహనాలు రోడ్డు మార్జిన్ గుండా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆగి ఉన్న వాహనాలు ఢీకొంటున్న ప్రయాణికులు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయంలో చర్యలు తీసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రిళ్లు దుకాణాలకు అనుమతులు ఉన్నాయా?

రాత్రివేళల్లో ప్రమాదాలు అధికంగా జరగడంతో గతంలో పోలీసులు ప్రత్యేకంగా చర్య తీసుకుని పోలీసింగ్ నిర్వహించి రాత్రి 11 గంటలు దాటితే దాబాలు, హైవే దుకాణాలు మూసించేవారు. రానురాను హోటల్స్ నిర్వాహకులు, రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఆ పద్ధతి కనుమరుగైంది. రాత్రివేళల్లో మూతపడాల్సిన హోటల్స్ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వస్తున్న డ్రైవర్లు హోటల్స్ 11 గంటలకు మూసివేస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటారు. హోటల్స్ దుకాణాలు తెరిచి ఉండడంతో ఇరువైపులా వాహనాలు నిలిపిస్తున్నారు. దీంతో జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలు గమనించక, కొన్ని సందర్భాల్లో రెప్పపాటున వెనుకనుంచి ఢీకొని ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో వందలాదిమంది ప్రాణాలు కోల్పోగా కొందరు వికలాంగులుగా మారారు. ఈ ప్రమాదాలు నిత్యం కొనసాగుతున్నా పోలీస్‌శాఖ, రవాణాశాఖ, హైవే పెట్రోలింగ్ విభాగం తగిన చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

● మూడేళ్లలో ఎన్ని ప్రమాదాలు అంటే..

ఆగిఉన్న వాహనాలు ఢీకొని, రాత్రివేళల్లో రెప్పపాటు జరిగిన ప్రమాదాలు ఎన్నో. ఒక తుని నియోజకవర్గంలోనే తుని రూరల్ సర్కిల్ పరిధిలో తుని, తొండంగి, కోటనందూరు మండలాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో మూడేళ్లలో రోడ్డుప్రమాదాల్లో 139మంది మృతి చెందగా వందలాదిమంది గాయాలపాలై వికలాంగులుగా కాలం వెళ్లదీస్తున్నారు. 20మందికిపైగా రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులై ఒకటి రెండేళ్ల తర్వాత చనిపోయిన వాళ్లు ఉన్నారు.



తుని మండలం గవరయ్య కోనేరు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన లారీ(ఫైల్)

సత్యదేవుడి సన్నిధిలో శివసదన్ కాటేజీకి రూ.20 లక్షల విరాళం
భక్తులతో పోటెత్తిన తలుపులమ్మ లోవ - 7లో
ఉత్సాహంగా రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు - 7లో
పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లింపు - 7లో
రెండోరోజు కొనసాగిన లాన్‌టెన్నిస్ పోటీలు - 7లో
తేటగుంట శివాలయంలో దొంగల బీభత్సం - 7లో

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం

- 'చలో తాడేపల్లి'ని అడ్డుకున్న పోలీసులు
- రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలోను అంగన్‌వాడీల అడ్డగింత
- పోలీస్‌స్టేషన్లలో బిక్కుబిక్కుమంటూ అంగన్‌వాడీలు
- రాత్రి 11 తర్వాత పూచీకత్తులతో విడుదల

కాకినాడ క్రైం, జనవరి 21: తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం 41రోజులుగా సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీలు ఆదివారం రాత్రి 'చలో తాడేపల్లి' పేరుతో విజయవాడ బయలుదేరగా ఎక్కడికక్కడ పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల ఆదివారం సాయంత్రం బస్సులు, రైళ్లలో బయలుదేరుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. వారిలో కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో 28మందిని, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో 49 మందిని, పోర్టు పోలీస్‌స్టేషన్‌లో నలుగురిని అదుపులోనికి తీసుకున్నారు. వారందరినీ మహిళలు అని కూడా చూడకుండా కస్టడీ సెల్‌లో నిర్బంధించి చుట్టూ పోలీస్ భద్రతా వలయం ఏర్పర్చడంతో భయానక వాతావరణంలో అంగన్‌వాడీలు రాత్రి 11 గంటల వరకు బిక్కుబిక్కుమంటూ గడిపారు. అనంతరం పూచీకత్తులపై వారిని విడుదల చేశారు. మహిళలపై ఈ తరహా నిర్బంధాలు గతంలో ఎప్పుడూ లేవని పలు ప్రజా సంఘాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి.

విధులకు హాజరుకాకపోతే చర్యలు తప్పవు: కలెక్టర్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 21: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, యూనియన్‌లతో పలు విడతలు చర్చలు జరిపి చాలావరకు వారి డిమాండ్లకు ప్రభుత్వం ఒప్పుకుందని, గౌరవ వేతనం నిమిత్తం మాత్రమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, అందువల్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సోమవారం ఉదయం 9గంటలలోపు విధులకు హాజరుకావాలని కలెక్టర్ కృతికశుక్లా ఆదేశించారు. లేకుంటే ఈనెల 22న టెర్మినేషన్ ఆర్డర్స్ ఇస్తామన్నారు. చివరి అవకాశంగా భావించి అంగన్‌వాడీలు వెంటనే విధుల్లోకి చేరాలన్నారు.



గొల్లప్రోలు మండలం దుర్గాడ రైల్వేస్టేషన్ వద్ద 'చలో తాడేపల్లి'కి బయలుదేరిన అంగన్‌వాడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మద్యంమత్తులో బైక్‌తో ఢీకొన్న వాహనచోదకుడు

- అంగన్‌వాడీ కార్యకర్తకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న మంగారత్నం

జీజీహెచ్(కాకినాడ), జనవరి 21: మద్యంమత్తులో వాహనచోదకుడు ఓ అంగన్‌వాడీ కార్యకర్తను బలంగా ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. కాకినాడ జగన్నాథపురం-2 సెక్టార్, రెల్లిపేట అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న బుద్దా వెంకటసూర్యమంగారత్నం కొద్దిరోజులుగా కలెక్టరేట్ సమీపంలో అంగన్‌వాడీల దీక్షలో పాల్గొంటుంది. ఆదివారం ఆమె దీక్షా శిబిరంనుంచి మంచినీళ్లు తాగేందుకు కలెక్టరేట్ వద్దకు నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో ఇంద్రపాలెం వంతెన వైపునుంచి ఓ తాగుబోతు మరో వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై మెయిన్ రోడ్డువైపు వేగంగా వెళ్తూ ఆమెను ఢీకొట్టాడు. ఆమె చీర చెంగు వాహనచక్రంలో చుట్టుకున్నా లెక్క చేయకుండా ఈడ్చుకుపోయాడు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని గమనించిన తోటి అంగన్‌వాడీ కార్యకర్తలు జీజీహెచ్‌కు తరలించారు. బాధితురాలి తలకు శస్త్రచికిత్స నిర్వహించాల్సి ఉందని న్యూరోసర్జరీ వైద్యులు తెలిపారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా నల్గొండమ్మ తల్లి బోనాల ఉత్సవం

- ఎస్.అన్నవరంలో అమ్మవారికి బోనాలు సమర్పించిన వేలాది మంది భక్తులు

తుని రూరల్, జనవరి 21: ఎస్.అన్నవరం గ్రామ దేవతగా విరజిల్లుతున్న శ్రీనల్గొండమ్మ తల్లి 12వ బోనాల ఉత్సవం ఆదివారం కన్నులపండువగా జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలు అందుకుంటున్న ఈ అమ్మవారికి ఏటా బోనాల ఉత్సవాన్ని ఆలయ కమిటీ అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది. ఎస్.అన్నవరం గ్రామంతోపాటు పరిసర ప్రాంతాలు, గ్రామాలనుంచి పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు తర్వాత బోనాలు శిరస్సున ధరించి ఎస్.అన్నవరం పురవీధుల్లో వైభవోపేతంగా శోభాయాత్ర నిర్వహించి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి భక్తులు అన్నప్రసాద వితరణ గావించారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదం స్వీకరించారు. ఈ వేడుకను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



ఎస్.అన్నవరంలో బోనాలతో వేలాదిగా తరలివస్తున్న భక్తులు

ఎట్టకేలకు నిధులు

- గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల
- దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- ఫలించిన సర్పంచ్‌ల పోరాటం
- 375 పంచాయతీలకు రూ.16.20కోట్లు
- పంచాయతీ ఖాతాలకు నిధుల జమ

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 21: ఎట్టకేలకు పంచాయతీ నిధులకోసం సర్పంచ్‌ల పోరాటం ఫలించింది. 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. పంచాయతీ ఎన్నికల్లో గెలిచినప్పటినుంచి నిధుల లేమితో పనులు ఏమీ చేయలేకపోతున్నామంటూ సర్పంచ్‌లు వినూత్న రీతిలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు నిధులకోసం రోడ్డెక్కారు. ఆర్థిక సంఘం నిధులు వాడుకోవడంపై కేంద్రప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వంపై సర్పంచ్‌లు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సర్పంచ్‌లు నిధులు సాధించుకున్నారు.

375 పంచాయతీలకు రూ.16.20కోట్లు

ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించడంపై పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు చేసిన పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నిధుల దుర్వినియోగాన్ని పలువురు కేంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. సర్పంచ్‌ల నిధుల ఉద్యమానికి వైసీపీ మినహా అన్ని రాజకీయ పక్షాలు మద్దతునిచ్చాయి. చివరకు సంక్రాంతి పండుగరోజు కూడా సర్పంచ్‌లు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఇలా అనేక రూపాల్లో ఉద్యమం తీవ్రతరం చేయడంతో ప్రభుత్వం తలవంచక తప్పలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఆయా గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ అయినట్టు సమాచారం. జిల్లాకు సంబంధించి 375 గ్రామ పంచాయతీలకుగాను 15వ ఆర్థిక సంఘం నిధులు బేసిక్ గ్రాంట్‌గా మొదటి విడత రూ.0.96కోట్లు, టైట్‌గ్రాంట్‌గా రెండో విడత రూ.16.10కోట్లు కలిపి మొత్తం రూ.16.20కోట్లు ఆయా గ్రామ పంచాయతీలకు జమయ్యాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా నిధులను పంచాయతీలు ఖర్చు చేయాల్సి ఉంది.

ఐదేళ్లుగా మళ్లింపు

జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు కేంద్రప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను దారిమళ్లిస్తోంది. వాటిని సొంతానికి వాడేసుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలోకి జమచేయాలని కేంద్రప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసిం ది. గ్రామ స్వరాజ్యం తీసుకువస్తామని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అధికారాలకు గండికొట్టిందన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం పీడీ ఖాతాలకు జమచేసుకుంది. సచివాలయాల నిర్వహణ ఖర్చును కూడా స్థానిక సంస్థలపై వేస్తోంది. నిధులు లేక పల్లెల్లో కనీసం పారిశుధ్య పనులు నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొంటున్నాయి. అదే సమయంలో నిధులు జమ చేయాలని సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో నిధులకోసం సర్పంచ్‌లు ఉద్యమాలను ఉధృతం చేశారు. సొంత నిధులతో పనులు చేపట్టి అప్పులపాలైన పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలున్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో కేంద్రప్రభుత్వం స్పందించడంతోపాటు సర్పంచ్‌ల ఉద్యమంతో ఉక్కిరిబిక్కిరి అయిన రాష్ట్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు.

కేంద్రం ఆదేశాలు తుంగలోకి తొక్కి..

పంచాయతీల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులను చేపట్టాలని కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. జలవనరులను పెంపొందించుకునేందుకు చెరువులు, కుంటలు అభివృద్ధి, చెక్కు డ్యాముల నిర్మాణం, ఇంకుడు కుంతల ఏర్పాటు, తాగునీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్య మెరుగుదల, మరుగుదొడ్ల నిర్మాణం, వ్యర్థాల నిర్వహణ తదితర పనులకు ఆర్థిక సంఘం నిధుల్లో ప్రాధాన్యమివ్వాలని కేంద్రం సూచించింది. నిధుల వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం తుంగలోకి తొక్కి అందుకు విరుద్ధంగా నిధులను ప్రభుత్వం దారి మళ్లించి వాడేసుకుంది. ఆర్థిక సంఘం నిధులు వచ్చాయని పంచాయతీలు అభివృద్ధి చేసుకోవచ్చని తలుస్తున్న తరుణంలో ఎల్‌ఈడీ లైట్ల నిమిత్తం రూ.2.93కోట్లు తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడంపై సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మోతుగూడెం రహదారులపై కమ్మేసిన పొగ మంచు

మంచు ముసుగు..

మోతుగూడెం, జనవరి 21: చింతూరు మండలం మోతుగూడెం మన్యంలో ఉదయం సాయంత్రం వేళలో దట్టంగా పొగమంచు కురుస్తోంది. ఉదయం 10గంటల వరకు భానుడు కనిపించడంలేదు. ఎదు రుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనాలు లైట్లు వెలుగులో రాకపోకలు సాగించారు. కొంతమంది ప్రకృతి ప్రేమికులు ఈ దృశ్యాలు సెల్‌ఫోన్‌లో బంధించారు.

31న ఆదికవి నన్నయ వర్సిటీ స్నాతకోత్సవం

- గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా పట్టాల ప్రదానం
- పద్మశ్రీ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్

రాజానగరం, జనవరి 21: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15 స్నాతకోత్సవ వేడుకలను ఈనెల 31న నిర్వహించ నున్నట్టు వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆదివారం తెలిపారు. ఇందు కు సంబంధించిన ఏర్పాట్లను చురుగ్గా జరుగుతున్నాయన్నారు. నన్నయ వర్సిటీ.. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, మన్యం(సగభాగం)జిల్లాల్లోని 390 అనుబంధ కళాశాలలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వ విద్యాలయంగా ఆవిర్భవించిందన్నారు. 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో స్నాతకో త్సవం ప్రారంభమవుతుందన్నారు. దీనిలో భాగంగా 2019-20, 2020-21, 2021-22 విద్యా సంవత్సరానికి చెందిన పీహెచ్‌డీ, పీజీ, పీజీ డిప్లమో, యూజీ అండ్ పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన వారికి పట్టాలు అందజేయనున్నారు. 13, 14, 15 స్నాతకోత్సవానికి వివిధ కోర్సులకు చెందిన 500 మంది విద్యార్థులు అప్లై చేసుకోగా, వీరిలో పీహెచ్‌డీ 12, గోల్డ్‌మెడల్స్ 12, ప్రైజ్ 12, మిగిలిన వారు పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ కోర్సులు పూర్తిచేసిన వారున్నారు. వీరందరికీ గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా పట్టాలు ప్రదానం చేయనున్నారు. మరో ముఖ్యఅతిథి భారతీయ సంఘ సేవకురాలు, రచయిత్రి, కంప్యూటర్ ఇంజనీర్, పద్మశ్రీ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవాన్ని పండుగలా నిర్వహించేందుకు వర్సిటీ అధ్యాపకులు, అందరూ సహకరించాలని ఈ సందర్భంగా వీసీ కోరారు.

'నన్నయ' స్నాతకోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ పద్మరాజు

ఆదికవి నన్నయ విశ్వవిద్యా లయంలో ఈనెల 31న జరుగనున్న స్నాతకోత్సవానికి విధిగా రావాలంటూ వర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆదివారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానించారు. ఈమేరకు గవర్నర్ కార్యాలయంలో అబ్దుల్ నజీర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. నన్నయ వర్సిటీలో స్నాతకోత్సవానికి విచ్చేసి విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయాలని ఈ సందర్భంగా కోరినట్టు వీసీ తెలిపారు.



ఈవో రామచంద్రమోహన్‌కు విరాళం అందజేస్తున్న దాత శివకుమార్

సత్యదేవుడి సన్నిధిలో
శివసదన్ కాటేజీకి రూ.20 లక్షల విరాళం

అన్నవరం, జనవరి 21: అన్నవరం దేవస్థానంలో సత్యగిరికొండపై నిర్మించిన శివసదన్ కాటేజీలో డోనార్స్కీం ద్వారా ఒక దాత రెండుగదులకు రూ.20 లక్షలు విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్.శివకుమార్ ఈ మొత్తాన్ని ఆలయ ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. రెండు గదులను చెట్టుపల్లి అప్పారావు, చెట్టుపల్లి పుష్ప అప్పారావు పేరున దాత చెల్లించారు. ఈ సందర్భంగా దాతను ఈవో అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.



అమ్మ కరుణ కోసం పూజారులతో బడిత పూజ చేయించుకుంటున్న భక్తులు

అమ్మ కరుణ కోసం బడిత పూజ

- ఎగబడిన భక్తులు
- నాగదేవతకు భక్తి శ్రద్ధలతో పూజలు
- దేవతామూర్తుల వేషధారణలతో ఇంద్రలోకాన్ని తలపించిన కొప్పవరం
- వైభవంగా సత్తెమ్మ జాతర ఉత్సవాలు

అనపర్తి, జనవరి 21: అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని కర్రి వారి సతెమ్మతల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. తమ గ్రా మానికి వచ్చిన అమ్మవారు పుట్టవద్దకు వెళ్లి అంతర్ధానమైందని అక్కడ నాగ దేవతగా అవతరించిందని ఇక్కడ భక్తుల నమ్మకం. ఈ ఆచారం ప్రకారం విచిత్ర వేషాలు ధరించిన భక్తులు గ్రామ పొలిమేరలోని పాములపుట్ట వద్దకు చేరుకుని నాగదేవతకు పాలుపోసి పూజలు నిర్వహించారు. రెండేళ్ల క్రితం జరిగిన జాతరలో అమ్మవారికి మొక్కుకుని సంతానం పొందిన మహిళలు తమ చిన్నారులకు వేషాలు వేయించి పుట్ట వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. పుట్ట వద్దకు వెళ్లే రహదారి అంతా విచిత్ర వేషధారులతో నిండిపోయింది. అనంతరం భక్తులంతా ఊరేగింపుగా అమ్మవారి ఆలయంవద్దకు చేరుకుని పూజారితో బడిత పూజకు సిద్ధమయ్యారు. ఆలయం ప్రాంగణానికి చేరుకున్న విచిత్ర వేషాల్లో ఉన్న భక్తులు పూజారి బయటకువచ్చి తమను ఆశీర్వదించాలని కేకలు వేయడంతో పూజారులు చేతిలో బడిత పట్టుకుని భక్తుల వద్దకు వచ్చారు. ఇలా వచ్చిన పూజారులను భక్తులు అల్లరిచేసి కోపం రప్పించడంతో ఆగ్రహించిన పూజారులు బడితలతో భక్తులను కొట్టడం ప్రారంభించారు. బడిత పూజ చేయించుకుంటే అమ్మ తమను కరుణిస్తుందని భక్తుల విశ్వాసం. పుట్ట వద్దకు వెళ్లేందుకు రకరకాల వేషాలు ధరించిన భక్తులు మోటారుసైకిళ్లపై తిరుగుతుండడంతో ఊరంతా కొత్త వాతావరణం ఏర్పడింది. కోయదొరలు, శక్తివేషాలు, పురుషులు మహిళలుగాను, చిన్నారులు ఈశ్వరుడు, శ్రీకృష్ణుడు అనేక రకాల వేషాలతో ఆకట్టుకున్నారు.



దర్శనానికి వచ్చిన గోల్డ్‌మేన్, అమ్మ కరుణతో పుట్టిన చిన్నారి చిన్న కారులో వచ్చిన దృశ్యం



నాగదేవతకు పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొక్కులు చెల్లించేందుకు నేడు భక్తుల భిక్షాటన

సత్తెమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునే భక్తులు సోమవారం జరిగే జాతరలో విచిత్ర వేషాలు ధరించి భిక్షాటన చేసేందుకు సిద్ధమయ్యారు. తమ దగ్గర ఉన్న తులమో పశమో అమ్మవారికి సమర్పించుకోవడం ఇక్కడ నిషేధం కాబట్టి మొక్కులు తీర్చుకునే భక్తులు జాతరలో విచిత్ర వేషం ధరించి భిక్షాటన చేయాల్సిందే.. ఇలా వచ్చిన మొత్తాన్ని అమ్మకు చెల్లిస్తేనే మొక్కు తీరుతుంది.

తలుపులమ్మా.. కరుణించమ్మా..

- భక్తులతో పోటెత్తిన లోవ
- ఆలయానికి రూ.4.98 లక్షల ఆదాయం

తుని రూరల్, జనవరి 21: కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో పోటెత్తింది. తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ అనంతరం పూజలు నిర్వహించి పండితులు దర్శనభాగ్యం కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.4.98లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాధ రాజు తెలిపారు.





భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు, ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుంటున్న భక్తులు

రెండోరోజు కొనసాగిన
లాన్‌టెన్నిస్ పోటీలు



పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పరిచయం చేసుకుంటున్న ఏడీ రాజశేఖర్

కాకినాడరూరల్, జనవరి 21: కాకినాడలో 67వ జాతీయస్థాయి బాలుర లాన్ టెన్నిస్ పోటీలు రెండో రోజు ఆదివారం ఉత్సాహంగా కొనసాగాయి. 19 సంవత్సరాలలోపు బాలురకు నిర్వహిస్తున్న ఈపోటీలు ఈనెల 24వరకూ కొనసాగనున్నాయని ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. పోటీలు డీఎస్ఏ, డీమార్ట్ సమీపంలోగల స్మార్ట్‌సిటీ టెన్నిస్‌క్లబ్, ఎస్పీ కార్యాలయం వెనుకగల టెన్నిస్ మైదానంలోనూ జరిగాయి. ఆదివారం మొత్తం 9మ్యాచ్‌లు నిర్వహించగా మహారాష్ట్ర, కేంద్రీయ విద్యాలయం జట్లమధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు 2-1 స్కోర్‌తేడాతో విజయం సాధించింది. అదేవిధంగా హర్యానా జట్టు తెలంగాణా జట్టుపై 2-0తో విజయం సాధించింది. ఢిల్లీజట్టు రాజస్థాన్‌పై 2-0తేడాతోనూ, ఏపీజట్టుపై గుజరాత్‌జట్టు 2-0తేడాతోనూ విజయం గెలుపొందింది. హర్యానాజట్టు మహారాష్ట్రపై 2-1స్కోర్‌తేడాతో విజయం సాధించిందని తెలిపారు. పోటీలను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర ఛైర్మన్ జి.భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి బీవీవీఎస్వీ ప్రసాద్, అఫీషియల్స్ కె.శ్రీకుమార్, డీవైఈవోలు డేనియల్‌రాజు, సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్‌కుమార్, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, పులయ్య, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రంగారావు, పీడీలు రవిరాజు, బంగారాజు, నూకరాజు, శ్రీనివాస్, పట్టాభి, మాసరరావు పర్యవేక్షిస్తున్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు



రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



జాతీయ పోటీలకు 30మంది క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం, జనవరి 21: పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండ్ మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఫ్రీస్టైల్, గ్రేకో రోమన్ తదితర విభాగాల్లో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని 16 జిల్లాలు నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పురుషులు, మహిళల విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన 30మంది క్రీడాకారులను జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 30, 31వ తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో జరిగే జాతీయ పోటీలకు వీరు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. పోటీల్లో విజేతలకు అధికారులు, ప్రజాప్రతినిధులు బహుమతులు, మెడల్స్ అందజేశారు. పోటీలను జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గు బ్బల ఎలీషా పర్యవేక్షించగా ఒలింపిక్ అసోసియేషన్ సీఈవో చుండ్రు గోవింద రాజులు, ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలరావు, పిఠాపురం మునిసిపల్ కమిషనర్ కృష్ణవేణి, సత్యనారాయణరెడ్డి, డీఎస్‌డీవో బి.మాణిక్యాలరావు, మునిసిపల్ వైస్‌ఛైర్మన్ కొత్తపల్లి పద్మబుజ్జి పాల్గొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లింపు

సామర్లకోట, జనవరి 21: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ట్రాక్ కారిడార్ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఈనెల 29 నుంచి విజయవాడ-విశాఖ మధ్య రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే ఏటీఎం చార్జి ఏ.సురేష్‌రెడ్డి సామర్లకోట రైల్వేస్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఆంధ్రజ్యోతి సదరు సమాచారాన్ని ఆదివారం రాత్రి సేకరించింది. నెం.13351 ధన్‌బాద్-అలెప్పీల మధ్య నడిచే బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 29నుంచి ఫిబ్రవరి 25 వరకూ నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. నెం.12835 హతియా-బెంగుళూరుల మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 30న, ఫిబ్రవరి 4,6,11,13,18,20,25 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. నెం.18637 హతియా-బెంగుళూరు మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 3,10,17,24 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం.22837 హటియా-ఎర్నాకుళం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 29, ఫిబ్రవరి 5,12,19 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం.18111 టాటా-యశ్వంత్‌పూర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 1,8,15,22 తేదీల్లో నిడద వోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం.12756 భావనగర్-కాకినాడ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 3,10,12,19 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరంటౌన్ మీదుగా నిడదవోలు చేరుతుంది. నెం.12509 బెంగుళూరు-గౌహతి మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 31, ఫిబ్రవరి 2,7,9,14,16,21,23 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్‌ల మీదుగా నిడదవోలు చేరుతుంది. నెం.11019 ముంబాయి-భువనేశ్వర్‌ల మధ్య నడిచే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 29,31, ఫిబ్రవరి 2,3,5,7,9,10,12,14,16,17,19,21,23,24 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్ మీదుగా నిడదవోలు చేరుతుంది. వివరాలకు సమీపంలోని రైల్వేస్టేషన్ బుకింగ్ కార్యాలయ సిబ్బంది ద్వారా సమాచారాన్ని తెలుసుకోవచ్చని సీనియర్ ఏటీఎం చార్జి ఏ.సురేష్ రెడ్డి తెలిపారు.



పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

రాజోలు, జనవరి 21: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మొదటి బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం రాజోలు యూత్ క్లబ్ ఆవరణలో జరిగింది. 1969లో ఎస్ఎస్‌సీ మొదటి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బందా సూర్యనారా యణ చొరవతో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసు కున్నారు. పూర్వ విద్యార్థి కోళ్ల వెంకన్న మాట్లాడుతూ ఆరేళ్లుగా స్నేహితులందరూ కలుసుకుంటున్నామన్నారు. పూర్వ విద్యార్థులకు బిళ్లకోట సోమేశ్వరరావు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో నయినాల సీతారామారావు, సూతాపల్లి అచ్యుత రామ నాగేశ్వరరావు, ఎస్.మాధవరావు, ఎం.మోహనరావు, అంగర సత్యనారాయణ, టీవీఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాజోలులో కలుసుకున్న 1969 నాటి పదో తరగతి విద్యార్థులు

మేడివాయిలో
పెట్రోల్ బంకు కూల్చివేత

- ఆ భూమిపై గతంలో ఎల్టీఆర్ కేసు.. రెండు సార్లు నోటీసులు
- ఖాతరు చేయకుండా నిర్మాణ పనులు
- కలెక్టర్ ఆదేశాలతో కూల్చివేసిన రెవెన్యూ అధికారులు



బంకు నిర్మాణ పనులను కూల్చివేస్తున్న దృశ్యం

ఎటపాక, జనవరి 21 మండల కేంద్రమైన ఎటపాక సమీపంలోని మేడివాయిలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న పెట్రోలు బంకు కట్టడాలను శనివారంరాత్రి రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు బంకు నిర్మాణాలను కూల్చి వేశారు. ఈ భూమిపై గతంలో ఎల్టీఆర్ కేసు నమోదై ఉందని, తహసీల్దార్ పృధ్వీ తెలిపారు. ఎల్టీఆర్ ఉండగా ఎలాంటి నిర్మాణాల పనులు చేపట్టకూడదని గతంలో హెచ్చరించామని తెలిపారు. ఇటీవల భూమిపై అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పుకొంటున్న ఓ వ్యక్తి ఎల్టీఆర్ ఖాతరు చేయకుండా బంకు నిర్మాణ పనులుచేస్తూ ఉండ డంతో రెవెన్యూ అధికారులు గత అక్టోబరులో, ఈనెల 2 తేదీన ఆ వ్యక్తికి నోటీసు అందజేశారు. అయినా లెక్కచేయకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తూ ఉండ డంతో కలెక్టర్ ఆదేశాలతో కట్టడాలపై చర్యలు తీసుకున్నారు. బంకు నిర్మాణం చేపడుతున్న వ్యక్తి ఈభూమిపై జీవో తెచ్చుకున్నారని, ఆ జీవోను న్యాయ స్థానంలో సవాలు చేయగా రద్దు చేసి ఆర్డీవో స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిందని తహసీల్దార్ తెలిపారు. ఏజెన్సీలో ఉన్నటువంటి ఈ భూమిపై గిరిజనేతరులు చెల్లని డాక్యుమెంట్లతో మ్యూటేషన్ చేయించుకున్నారని, అవి చెల్లదని దాంతో నిర్మాణాలను కూల్చివేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

రౌతులపూడిలో
యానాం మద్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

రౌతులపూడి, జనవరి 21: కాకినాడజిల్లా రౌతులపూడిలో పోలీస్‌లు అక్రమంగా నిల్వఉంచినయానాం మద్యం పట్టుకున్నారు. రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపిన వివరాలు ప్రకారం.. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు... పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాలతో ఒక వ్యక్తి నుంచి 192 బీర్లు, 180 ఎమ్ఎల్ విస్కీ 129 సీసాలు, 375 ఎమ్ఎల్ విస్కీ 45 సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. అలాగే రౌతులపూడి వంతెనపై 30 లీటర్లు సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

వైసీపీ నాయకుల జేబులు నింపేందుకే
ఇసుక ర్యాంపుల్లో అనధికార వసూళ్లు

- మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- రెండోరోజు లారీ అసోసియేషన్ సభ్యుల నిరసన

రావులపాలెం, జనవరి 21: ఇసుక ర్యాంపులో అనధికారకంగా చేస్తున్న వసూళ్లు వైసీపీ నాయకుల జేబులు నింపేందుకా అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గోపాలపురం ఇసుక ర్యాంపులో ఉభయగోదావరిజిల్లాల లారీ అసోషియేషన్ సభ్యులు రెండో రోజు కార్యక్రమం ఆదివారం కొనసాగించారు. ట్రాక్టర్‌కు రూ.500, ఆరు టైర్ల లారీకి రూ.1000, పది టైర్ల లారీకి రూ.1500, పన్నెండు టైర్ల లారీకి రూ.2000వంతున ఇసుక ర్యాంపుల్లో అక్రమ వసూళ్లు చేస్తుండటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామంటూ లారీ అసోషియేషన్ సభ్యులు నిరసన చేపట్టారు. గోపాలపురం ఇసుక ర్యాంపులో చేపట్టిన నిరసనలో భాగంగా వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ రాష్ట్రతెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ టీడీపీ నాయకులతో కలిసి అక్కడికి వెళ్లిసంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల లారీ అసోషియేషన్‌కు టీడీపీ అండగా ఉండి దోపిడీ అడ్డుకుంటామన్నారు. ర్యాంపులో ఇసుక లారీ ఓనర్స్ దగ్గర బాటచార్జీల పేరుతో వైసీపీ రౌడీమామూళ్లు అని ప్రశ్నించారు. అనధికారిక వసూళ్లు వైసీపీ నాయకులు జేబులు నింపేందుకే అన్నారు. చట్టపరమైన, కనీసం పర్యావరణ అనుమతులు కూడా లేకుండా అక్రమంగా ఇసుక తవ్వడం దారుణమన్నారు. అంతేకాకుండా బాట చార్జీలపేరుతో వైసీపీ వసూళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి దండుకుంటుందన్నారు. ఈ ఇసుకాసురుల ఆగడాలను లారీ ఓనర్స్ అసోషియేషన్స్‌తో కలిసి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, నాయకులు అధికారి నాగు, గుత్తుల పట్టాభిరామారావు, కంఠంశెట్టి శ్రీనివాస్, దర్నాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లారీ అసోసియేషన్ సభ్యుల నిరసనకు బండారు సంఘీభావం

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

- మృతుడు కాకినాడ వాసి



ఉదయ్‌కుమార్ (ఫైల్)

అచ్యుతాపురం రూరల్, జనవరి 21: అచ్యుతాపురం మండలంలోని ఆవసోమవరం శివారు పిల్లోడుపాలెం సమీపంలో గల చెరువుగట్టు వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కాకినాడజిల్లా జగన్నాథపురంలోని రిక్షా వీధికి చెందిన కాకి ఉదయ్‌కుమార్(20) రెండు రోజుల క్రితం చోడపల్లిలోని తన చెల్లి, బావ ఇంటికి వచ్చాడు. అక్కడ ఆనందంగా గడిపి ఆదివారం ఉదయం సమీపంలోని పిల్లోడిపాలెంలో గల బంధువుల ఇంటికి వెళుతున్నానని చెప్పి బయలు దేరాడు. అయితే అక్కడికి సమీపంలోని చెరువు వద్ద తన ద్విచక్ర వాహనాన్ని ఆపి అక్కడేఉన్న చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. గ్రామస్థులు సమా చారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి వచ్చి మృతుని జేబులో ఉన్న అడ్రస్ కాగితం ఆధారంగా అతని వివరాలు తెలుసుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. అతను ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు.

తేటగుంట శివాలయంలో దొంగల బీభత్సం

- హుండీల్లో నగదు, బంగారు ఆభరణాల చోరీ



దుండగులు దొంగలించిన హుండీ, ధ్వంసం చేసిన సీసీ కెమెరాల కిట్టు

తునిరూరల్, జనవరి 21: వరుస దొంగతనాలతో దుండగులు హడలెత్తిస్తున్నారు. ఏడాది కాలంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న తేటగుంట గ్రామంలో పలు ఆలయాల్లో దేవతామూర్తుల బంగారం, వెండి ఆభరణాలు, హుండీల చోరీ ఘటనలు మరువక ముందే ఆదివారంరాత్రి దుండగులు ఆలయాల్లో బీభత్సం సృష్టించారు. మెట్టలో ప్రసిద్ధి ఆలయమైన తేటగుంట శివాలయంలో దుండగులు చొరబడ్డారు. ఆలయ ద్వారాలకు ఉన్న తాళాలు పగలకొట్టి గుడిలోకి ప్రవేశించి సీసీ కెమెరాలు, విద్యుత్ లైట్లు ధ్వంసం చేశారు. అనంతరం స్వామివారి గర్భగుడి తలుపులను తొలగించి అమ్మవారి మెడలోని మంగళసూత్రం, హుండీలను చోరీ చేశారు. అదేవిధంగా శివాలయం ప్రక్కనే గల సాయిబాబా ఆలయంలో ఈ తరహాలోనే చోరీకి పాల్పడిఅక్కడహుండీలోని నగదును అపహరించారు. దీంతో స్వామి వారి మేలుకొల్పు పూజకు ఆలయాలకు వెళ్లిన అర్చకులు చెల్లా చెదురుగా ఉన్న వస్తువులను చూసి ఖంగుతిన్నారు. దీంతో ఆలయ కమిటీలకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఇటీవల గ్రామంలో వరుస దొంగతనాలతో ఆలయాలకు రక్షణ కరువైందని రెండేళ్లలో శివాలయంలో మూడుసార్లు ఆలయంలో దొంగలు ప్రవేశించి ఆలయ సంపదను చోరీ చేయడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు చేపట్టి దొంగలను పట్టుకుని ఆలయాలకు రక్షణ కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలుపుతున్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, స్పందన

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 21: కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్, అనంతరం స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. డయల్ యువర్ కమిషనర్‌లో 08842357800కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైసీపీ ప్రభుత్వం ఇంటికెళ్తేనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

కాకినాడ సిటీ, జనవరి 21: వైసీపీ ప్రభుత్వం ఇంటికెళ్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్ర ప్రజలు మనుగడ సాధించగలుగుతారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంపద సృష్టించలేని జగన్‌రెడ్డి అప్పులు చేసి రాష్ట్రాన్ని, ప్రజలను అధోగతి పాలుజేశారన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, సామాన్యుడు మనుగడ సాగించాలన్నా వైసీపీ అధికారంనుంచి వైదొలగాలన్నారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని 20ఏళ్ల వెనక్కి తీసుకెళ్లిన ఘనత జగన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైసీపీ పాలనలో పేద, బడుగు బలహీన వర్గాల వారే ఎక్కువగా నష్టపోయారన్నారు.

అధికారం కోసమే కోడి కత్తి డ్రామా : పావని

జగన్‌రెడ్డి అధికారం కోసమే కోడి కత్తి డ్రామా ఆడాడని, ఇందుకు ఒక దళితుడి జీవితం పణంగా పెట్టాడని కాకినాడ జిల్లా తెలుగు మహిళాధ్యక్షురాలు సుంకర పావని విమర్శించారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ వాడుకుని వదిలేయడంలో సిద్ధహస్తుడైన జగన్‌రెడ్డి కోడి కత్తి కేసులో కూడా దళితుడైన శ్రీనివాస్‌ను వాడుకుని వదిలేశాడన్నారు. ఇకనైనా కోడి కత్తి కేసులో జనాలను మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని పావని హితవు పలికారు.

'కాపులను మోసం చేసే ఉద్దేశంతో ప్రభుత్వం'

సర్పవరం జంక్షన్, జనవరి 21: చట్టబద్ధతలేని వలంటీర్లతో కులగణన చేయించి రాష్ట్రంలో ఉన్న కాపులను మోసం చేసే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని దీనిని వ్యతిరేకించాలని ఆంధ్ర కాపు సద్భావన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో గల శుభం కాపు కల్యాణ మండపంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన ప్రక్రియ అనేది ఒక విధానపరంగా చట్టబద్ధంగా సాగాలన్నారు. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో సమగ్రంగా శాస్త్రీయంగా సర్వే చేయించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నియమించుకున్న వలంటీర్ వ్యవస్థ ద్వారా ఒక యాప్ రూపొందించి వేలిముద్రలు సేకరిస్తూ, ఓటీపీ ద్వారా కులగణన నిర్వహిస్తున్నారన్నారు. ఇది ముమ్మాటికీ ప్రజలను మోసం చేసే ధోరణిలో జరుగుతుందని విమర్శించారు. చట్టబద్ధతలేని వలంటీర్లతో ప్రభుత్వం నిర్వహిస్తోన్న కులగణనను కాపు, తెలగ, ఒంటరి, బలిజ కులాలు వారు వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో సద్భావన సంఘం సభ్యులు బసవా ప్రభాకరరావు, అడపా ప్రకాశ్‌నాయుడు, బాజిబోయిన వెంకటేష్‌నాయుడు, రంగ నాయకులు, దామిశెట్టి శ్రీనివాస్, నూకల బలరాం, జంక్షన్ బాబ్జి, గుంతముక్కల విష్ణు, కొమ్మర్తి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'బీసీలను గుర్తించకపోతే గుణపాఠం తప్పదు'

ప్రత్తిపాడు, జనవరి 21: బీసీలు అధికంగా ఉన్న ప్రత్తిపాడు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, వైసీపీ ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలను గుర్తించకపోతే రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీలకు గుణపాఠం తప్పదని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. ప్రత్తిపాడు సంఘ కార్యాలయంలో ఆదివారం అన్ని రాజకీయ పార్టీలకు చెందిన సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు సీటు బీసీలకు ఇచ్చే పార్టీకే తమ మద్దతని వారు స్పష్టం చేశారు. బీసీల సత్తా ఏమిటో వైసీపీ, టీడీపీ, జనసేనకు వచ్చే ఎన్నికల్లో తెలియజేస్తామని తెలిపారు. సమావేశంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ యల్లపు బులిరాజు, ముచ్చు అప్పలరాజు, కొయ్యా శ్రీనుబాబు, దేవర అనూషయాదవ్, గొంప శివకుమార్, యడ్ల వీరాస్వామి, మదినే నూకరాజు, ఒమ్మిగంగరాజు, చిలపర్తి శ్రీనివాస్, కట్టమూరి కొండబాబు, ధర్నాల కోట తాతబ్బాయి, లక్ష్మీనారాయణ, నూరికుర్తి వినోద్ ఉన్నారు.

'బీజేపీని పటిష్టం చేసేందుకు కృషి'

పిఠాపురం, జనవరి 21: పోలింగ్‌బూత్ స్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని పటిష్టం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిఠాపురం నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు సూచించారు. పిఠాపురం పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు వాటిని వినియోగించుకునేలా శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి ఇంటికి బీజేపీ లక్ష్యాలు, కేంద్ర పథకాలు చేరేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, నియోజకవర్గ కోకన్వీనర్ వాసంశెట్టి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, రవణం సుబ్రహ్మణ్యం, అల్లుబోయిన సూరిబాబు, తోట ఏడుకొండలు, కర్నీడి తాతీలు పాల్గొన్నారు.

'రైతు హక్కులకు భంగం భూ హక్కు చట్టం'

ప్రత్తిపాడు, జనవరి 21: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన టైటిలింగ్ యాక్ట్ భూ హక్కు చట్టం రైతు హక్కులకు భంగమని సాధారణ పౌరులకు కూడా ఈ చట్టం తీవ్రనష్టం చేకూర్చనుందని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు చెప్పారు. మండలంలోని ధర్మవరం రాజగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఐజాల్ ఆధ్వర్యంలో భూ హక్కు చట్టంపై నిర్వహించిన రైతాంగ అవగాహన సదస్సుకు జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శిదాసం శేషారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తమ్మయ్యబాబు మాట్లాడారు. ఐలాజ్ ప్రతినిధి బుగతా శివ, రైతు నేతలు బొల్లు కొండబాబు, ఇంధన ఏసుబాబు, సానానూకరాజు నాయుడు, దొడ్డిపట్ల సోమన్నదొర, తాడివెంకట్రావు, జనసేన నాయకులు రామకుర్తి కామేష్, నల్లల రామకృష్ణమురాలశెట్టి సునీల్‌కుమార్ ఉన్నారు.

'ఓంకార స్వామి మహనీయుడు'

ప్రత్తిపాడు, జనవరి 21: శాంతి కోసం శాంతి ఆశ్రమం స్థాపించిన మహనీయుడు ఓంకార స్వామి అని రుషికేష్ పీఠాధిపతి పద్మనాభనంద సరస్వతి తెలిపారు. మండలంలోని శాంతి ఆశ్రమంలో ఓంకార స్వామి 130వ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆధ్యాత్మిక సభకు ఆశ్రమ పీఠాధిపతి మాతా జ్ఞానేశ్వరిదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పద్మనాభనంద మాట్లాడుతూ ఓంకార స్వామి బోధనలు సర్వ మానవాళిక ఆచరణదాయకమన్నారు. ఆశ్రమంలో ప్రణవ పతాకాన్ని జ్ఞానేశ్వరి దేవి ఆవిష్కరించారు. అష్టోత్తర పూజలు, శివాలయంలో అర్చనలు, లక్ష పత్రి పూజలు,ఓంకార మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఓంకార స్వామి స్థాపించిన శాంతి పత్రిక 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శాంతి శత జయంతోత్సవ 120పేజీల విశేష సంచికను పద్మనాభనంద ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం జరిగింది.

విశ్వ బ్రాహ్మణ సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కిర్లంపూడి, జనవరి 21: జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం కిర్లంపూడి బ్రహ్మంగారి ఆలయంలో ఆదివారం జరిగింది. గౌరవనీయులైన రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ మావూరిజ్యోతి, బ్రహ్మశ్రీ గోర్స శ్రీనివాసాచార్యులు సతీమణి రాజ్యలక్ష్మి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచార్యులు, రిటైర్డ్ డీఎస్పీ నామగిరి బాబ్జి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విశ్వ బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ తాళాబత్తుల వీర భద్రాచార్యులు, పెద్దాపురం అధ్యక్షులు ఒంటిమిల్లి చంద్రశేఖర్, సంఘం జిల్లా అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం కిర్లంపూడి అధ్యక్షుడు కొత్తల వీరప్రసాద్, కార్యదర్శి గానుగుల శ్రీనివాసరావు, లక్కోజు శివ, మొదిలే త్రిమూర్తులు, జొన్నకోటి నాగేశ్వరరావు ఉమ్మడి జిల్లా నాయకులున్నారు.

'యాదవులకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలి'

శంఖవరం, జనవరి 21: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో యాదవ కులస్తులకు అన్ని పార్టీలు ఎమ్మెల్యే ఎంపీ సీట్లు కేటాయించాలని యాదవ జిల్లా నాయకుడు అల్లి రాజుబాబు డిమాండ్ చేశారు. మండలంలోని సీతంపేట గ్రామంలో ఆదివారం యాదవుల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఇవ్వాలని కోరారు. యాదవుల ఓటుబ్యాంక్ వినియోగించుకుంటున్న పార్టీలు టిక్కెట్లు ఇచ్చి న్యాయం చేయాలన్నారు. దేవర అనూష, కొయ్యా శ్రీను, బర్ల సీతారత్నం, బర్ల విజయ్ పాల్గొన్నారు.

'విప్లవ చైతన్యాన్ని అలవర్చుకోవాలి'

సామర్లకోట, జనవరి 21: కార్మికవర్గం విప్లవ చైతన్యాన్ని అలవర్చుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. వీఐ లెనిన్ వర్ధంతి సందర్భంగా సామర్లకోట సీపీఐ కార్యాలయంలో ఆదివారం లెనిన్ చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామర్లకోట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బొచ్చా శ్రీను, కశింకోట ఆనందరావు, బర్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ 1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ 2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

జనసేనలోకి చేరికలు

కొండెవరం (కొత్తపల్లి), జనవరి 21: కొండెవరం గ్రామానికి చెందిన సుమారు 600 మంది కార్యకర్తలు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. వారికి పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై యువకులు, పెద్దలు, మహిళలు పార్టీలో చేరారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా? పవన్‌ను సీఎం చేద్దామని ప్రజలు ఎదురు చూస్తున్నారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు అడ్డుకట్ట

» విజయవాడ వెళ్లకుండా

రైల్వే, బస్‌స్టేషన్లల్లో పోలీసుల పహారా

» ముందస్తు నోటీసులు



పిఠాపురం రైల్వేస్టేషన్‌లో పహారా కాస్తున్న పోలీసులు

పిఠాపురం, జనవరి 21: తాడేపల్లిలో సీఎం జగన్ నివాసం ముట్టడికి అంగన్‌వాడీలు పిలుపునిచ్చిన నేపథ్యంలో వారు తరలివెళ్లకుండా చూసేందుకు పోలీసు శాఖ ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల పరిధిలోని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు, అంగన్‌వాడీ వర్కర్లుకు ఛలో తాడేపల్లికి వెళ్లవదని, వెళ్తే చర్యలు తీసుకుంటామంటూ నోటీసులు జారీ చేశారు. పిఠాపురం సర్కిల్ పరిధిలో 62మందికి ఈ విధంగా నోటీసులు జారీ చేశారు. మరోవైపు విజయవాడ వైపు వెళ్లే రైళ్లల్లో అంగన్‌వాడీ వర్కర్లు తరలివెళ్తారనే సమాచారంతో పిఠాపురం రైల్వేస్టేషన్ వద్ద పోలీసు పికెట్‌తో పాటు భారీ పోలీసు పహారా ఏర్పాటు చేశారు. మహిళా పోలీసులను ఇందునిమిత్తం వినియోగిస్తున్నారు. రైళ్లల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు పలువురు ఇప్పటికే వివిధ మార్గాల్లో విజయవాడ చేరుకున్నారు. పోలీసులు అప్రమత్తమయ్యే సమయానికే వారు చేరుకున్నట్టు సమాచారం. మరోవైపు రైల్వేస్టేషన్‌లో పరిస్థితిని పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మురళీమోహన్ పర్యవేక్షిస్తున్నారు.

సామర్లకోట: సామర్లకోట పోలీసులు వివిధ ప్రాంతాలకు చెందిన 75మంది అంగన్‌వాడీ సిబ్బందిని అదుపులోకి తీసుకుని స్టేషన్లో నిర్బంధించారు. విజయవాడ సదస్సుకు సిబ్బంది రైళ్లల్లో తరలివెళ్లకుండా పోలీసులు సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణకు మొహరించారు. దీంతో పోలీసుల చర్యలను ఎలాగైనా తిప్పికొట్టేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి కొందరు విజయవాడ తరలివెళ్లారు.

కొత్తపల్లి: విజయవాడ ధర్నాకు వెళ్లకుండా మండలంలో 30మందికి అంగన్‌వాడీలకు కొత్తపల్లి పోలీసులు ఆదివారం నోటీసులు జారీ చేశారు. అందుబాటులో కేవలం 10మందిని అరెస్ట్ చేసి మిగిలిన 20మంది లేకపోవడంతో ఇళ్లకు నోటీసులంటించారు.

గండేపల్లి: గండేపల్లి,మురారి జాతీయరహదారిపై బస్సులు, పలు వాహనాలు తనిఖీ చేసి వాహనాల్లో వెళ్తున్న అంగన్‌వాడీలను సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ రామకృష్ణ, పోలీస్‌సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.

తుని రూరల్: తుని పోలీస్‌స్టేషన్ ఎదుట అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. తమ సొంత పనులపై బయటకు వెళ్తున్న తమను రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు అడ్డగించి సెల్‌ఫోన్ లాక్కుని స్టేషన్‌కు తీసుకొచ్చారని వాపోయారు. ప్రభుత్వ ఉద్యమ అణచివేత ధోరణి వీడనాడాలని పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు అంగన్‌వాడీ నాయకులు తెలిపారు



గండేపల్లి: బస్సులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

'అంగన్‌వాడీలకు అండగా ఉంటాం'

తాళ్లరేవు, జనవరి 21: రాబోవు రోజుల్లో జనసేన, టీడీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీలకు అండగా ఉండి న్యాయం చేస్తామని ముమ్మిడివరం జనసేన పార్టీ కోఆర్డినేటర్ పితాని బాలకృష్ణ అన్నారు. తాళ్లరేవులో అంగన్‌వాడీల సమ్మెకు ఆయన సంపూర్ణ మద్దతును తెలియజేశారు. అంగన్‌వాడీలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత వుంగరాల వెంకటేశ్వరరావు, జనసేన కన్వీనర్ అత్తిలి బాబూరావు, జనసైనికుడు సుందరపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి టీడీపీలో సముచిత స్థానం

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు



వెంకటాపురంలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణుడు

తుని రూరల్, జనవరి 21: కష్టపడి పనిచేసే వారికి టీడీపీలో సముచిత స్థానం ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు తెలిపారు. తేటగుంట పంచాయతీ శివారు వెంకటాపురం, ఎర్రకోనేరు గ్రామాల్లో పెద్ద ఎత్తున కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు పోల్నాటి శేషగిరిరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చిరంజీవిరాజు తదితరులు ఉన్నారు.

బీసీ సదస్సులు

కోటనందూరు: వైసీపీలో బీసీలకు అన్యాయం జరిగిందని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు అన్నారు. అప్పలరాజుపేట, ఎస్సార్‌పేటలో జరిగిన బీసీ సదస్సుల్లో కృష్ణుడు మాట్లాడారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, సుర్లలోవరాజు, అంకంరెడ్డి రమేష్, డి.చిరంజీవి రాజు, పోతల సూరిబాబు, పెంటకోట భాస్కరసత్యనారాయణ, మాతిరెడ్డి బాబులు, పెనుమర్తి నాగూర్, బీసీసెల్ మండలాధ్యక్షుడు పంపనబోయిన శ్రీమన్నారాయణ, జనసేన నేత శ్రీనివాస్, లెక్కల భాస్కర్, గుడివాడ వీరబాబు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

రౌతులపూడి, జనవరి 21: మండలంలోని ఎ.మల్లవరం గ్రామంలో వైసీపీకి చెందిన 100 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ నేత లెక్కల రాము ఆధ్వర్యంలో లెక్కల జోగిబాబుతో సహా 100 మంది ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరగా సత్యప్రభ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలోకి చేరినవారు, టీడీపీ నేతలు సత్యప్రభను భారీ గజమాలతో సత్కరించారు. సత్యప్రభ ఎ.మల్లవరంలో భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ భవిష్యత్ గ్యారంటీ పథకాలను వివరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారా యణ, ఎంపీపీలు గంటిమళ్ల రాజ్యలక్ష్మి, గొల్లపల్లి బుజ్జీ, టీడీపీ యువనేతలు పల్లికుమార్, గవిరెడ్డి గురునాథ్, లెక్కల రాము, వెన్నాశివ, కొమ్ముల కన్నబాబు, కోసూరి శ్రీనువాస్ వర్మ, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



కాకినాడ రూరల్: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఐవీరావు

కాకినాడ రూరల్, జనవరి 21: డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఆదివారం ల్యాబ్ ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షా శిబిరాన్ని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వీసీ, మాజీ డీఎంఈ డాక్టర్ ఐవీరావు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరాలు ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడానికి తోడ్పడతాయన్నారు. సుమారు 255మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంబీఆర్‌శర్మ, డాక్టర్ సీఎస్‌ఎస్ శర్మ, డాక్టర్ రామ్ సర్వోప్‌జవహర్, డాక్టర్ కళాసాగర్, డాక్టర్ బాదం దాశరధి వైద్యసేవలు అందజేయగా ట్రస్ట్‌చైర్మన్ బాలకృష్ణ, కార్యదర్శి రమణమూర్తి, కోశాధికారి మోహన్‌రావు తదితరులున్నారు.

రమణయ్యపేటలో...

సర్పవరం జంక్షన్, జనవరి 21: భావశ్రీ ఆర్థోపెడిక్ అండ్ ఈఎన్‌టీ క్లినిక్ డాక్టర్ చల్లా భావతేజ ఆధ్వర్యంలో ఆదివారం రమణయ్యపేట ఒకటో డివిజన్ శ్రీ లక్ష్మి వినాయక కమ్యూనిటీ ఫంక్షన్ హాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కీళ్ల నొప్పులు మహిళల్లో అధికమని, తొలిదశలోనే వీటిని గుర్తించి మందులు వాడితే వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. సరైన వ్యాయామంతో పాటూ అధిక పోషక విలువలు గల ఆహార పదార్థాలను తీసుకోవాలని కోరారు. డాక్టర్ స్వాతి ఆకుల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాదరావు, శిరీష పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ లేకుండా పోయింది

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప



చంద్రంపాలెంలో ప్రసంగిస్తున్న చినరాజప్ప

సామర్లకోట, జనవరి 21: వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందని వారికి రక్షణ కల్పించే దిశగా భరోసా ఇచ్చేందుకు టీడీపీ జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని రావువారి చంద్రంపాలెంలో ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజప్ప మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. 34శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి వైసీపీ బీసీలకు అన్యాయం చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్లను తగ్గించిందన్నారు. 16వేల ఎకరాల బీసీల అసైన్డ్ భూములను కూడా వెనక్కి తీసుకుందని ఆరోపించారు. జీవో 217 తీసుకొచ్చి మత్స్యకారుల వెన్నెముక విరగ్గొట్టిందన్నారు. బీసీసోదరుల తరపున పోరాడుతున్న టీడీపీకి బీసీ నేతలపై కేసులు పెట్టి వేధించారన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని రాజప్ప స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ సభ్యులు సత్య, రమేష్, బాలాజీ, రామారావు, చీకట్ల వెంకటేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందు సామర్లకోట పట్టణ పరిధిలో గాంధీనగర్ మున్సిపల్ పాఠశాల ఆవరణలో జరిగిన జయహో బీసీ సదస్సులో రాజప్ప, రాష్ట్ర బీసీ నాయకులు ప్రసంగించారు.

వైసీపీని తరిమికొడితేనే ఏపీ అభివృద్ధి

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



పిఠాపురంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, జనవరి 21: వైసీపీ ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొడితేనే ఏపీ అభివృద్ధి సాధ్యమవుతుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి వచ్చాక ప్రజలపై పన్నులు, చార్జీలు రూపంలో బాదుడేబాదుడుతో పేద, బలహీన, అట్టడుగు సహా అన్నివర్గాల ప్రజలు జీవనం సాగించలేని పరిస్థితి ఉందన్నారు. ఐదేళ్లలో ఒక్క రూపాయి ఆదాయం అదనంగా పెరగకపోగా, రూ.10లక్షల కోట్లకు పైగా అప్పు మాత్రం చేసి రుణాల్లో రికార్డు సృష్టించారని ఎద్దేవా చేశారు. మద్యనిషేధం అమలు చేసిన తర్వాతే ఓటు అడుగుతానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఊరువాడ మద్యం ఏరులై పారేలా చేశారని విమర్శించారు. నాసిరకం మద్యం బ్రాండ్లను పెట్టి ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో ఒక్కసారి కూడా కరెంటు చార్జీలు పెంచకపోగా, వైసీపీ హయాంలో తొమ్మిది సార్లు పెంచారని, మరోమారు పెంచేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని తెలిపా రు. చెల్లి, తల్లికి న్యాయం చేయలేని జగన్ ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని ఆయన ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు నెలకు రూ.1500 ఇస్తామని, 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన పొత్తుతో వైసీపీ భూస్థాపితం

జనసేన కాకినాడ రూరల్ ఇన్‌చార్జి నానాజీ



ప్రచారం నిర్వహిస్తున్న పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జనవరి 21: టీడీపీ-జనసేన పొత్తుతో ప్రజాకాంక్ష మేరకు రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోన్న వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమైందని జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ రూరల్ మండలం వి.వెంకటాపురంలో జనసేన, టీడీపీ నాయకులు గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక సదుపాయాల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇళ్ల పట్టాలిచ్చి, స్థలాలు చూపించలేదన్నారు. ఒక్కసారంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతి పాలు చేశారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు, పవన్‌లతోనే సాధ్యమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం గ్యారంటీ అని, ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కరెడ్ల గోవిందు, శిరంగు శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి బాబీ, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, రాందేవు సీతయ్యదొర, దేవు వెంకన్న పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



గొల్లప్రోలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గొల్లప్రోలు, జనవరి 21: గొల్లప్రోలులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1974-75 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు అర్ధ శతాబ్దం తర్వాత ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. 100మంది విద్యార్థులకు గానూ 15మంది చనిపోయారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన 54మంది పూర్వ విద్యార్థులు తమ కుటుంబసభ్యులతో ఆత్మీక కలయికకు హాజరయ్యారు. కుటుంబాలు పరిచయాలు చేసుకోవడంతో పాటు పిల్లలు, కుటుంబస్థితిగతులు తదితర విషయాలు మాట్లాడుకుంటూ విద్యార్థి దశలో చేసిన అల్లరి, చిలిపి పనులు గుర్తుకు తెచ్చుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరదాగా గడిపారు. నాడు చదువు చెప్పిన గురువులను సత్కరించారు. ఇకపై ప్రతి ఏటా కలుసుకోవాలని నిర్ణయించుకుని బారమెక్కిన హృదయాలతో వీడ్కోలు చెప్పుకున్నారు.

కాకినాడలో...

కాకినాడ సిటీ, జనవరి 21: కాకినాడ జగన్నాథపురంలోని మల్లాడి సత్యలింగం నాయకర్ ఛారిటీస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1976-77 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆహ్లాదకరంగా సాగింది. ఎంఎస్ఎన్ ఛారిటీస్ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒకరినొకరు పలకరించుకున్నారు. 100మందికిపైగా పూర్వవిద్యార్థులు సందడిగా గడిపారు. కార్యక్రమాన్ని గ్రూపు ఫౌండర్ ఆదం గోవిందరాజులు ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ గుత్తుల రమణ, గరద వీరభద్రరావు, సమ్మి రాజబాబు, శీరం నాగేంద్ర కుమార్, వాడపల్లి సత్యనారాయణ, సుశీల నిర్వహించారు. ఛారిటీస్ సంస్థ వంశపారంపర్య చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, ఈవో బాబూరావు, హైస్కూల్ హెచ్ఎమ్ ఎం.సుబ్రహ్మణ్యాలను సత్కరించారు. చదువుకునే నిమిత్తం ఇద్దరు పేద విద్యార్థులకు రూ.5వేల చొప్పున అందజేశారు.



నేడు వికసిత్ భారత్ సంకల్పయాత్ర



సమావేశ మందిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 21: ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరిట రాగిరెడ్డి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్టు కమిషనర్ నాగనరసింహారావు తెలిపారు. ఈ మేరకు సమావేశ ఏర్పాట్లను వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ కామర్స్‌మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి ఐఏఎస్ అధికారి పీయూష్‌కుమార్, ఎంపీ వంగా గీత, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమణారెడ్డి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగేశ్వరనాయక్, గృహనిర్మాణశాఖ డీఈ సత్యనారాయణరెడ్డి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరామ్, ఈఈ మాధవి, హెల్త్‌ఆఫీసర్ డి.పృథ్వీచరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, సీటీఆర్వో మానే కృష్ణమోహన్ ఉన్నారు.

కె.గోపాలపురంలో సంకల్పయాత్ర

గండేపల్లి, జనవరి 21: మండలంలోని కె.గోపాలపురంలో సర్పంచ్ కర్రి సూర్యాకాంతం ఆధ్వర్యంలో కార్యదర్శి తరంగిణి అధ్యక్షతన నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రకు బీజేపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ వేటుకూరి సూర్యనారాయణ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రామన్, తహశీల్దార్ వి.సత్యనారాయణ, అవసరాల పార్థసారధి, ఆంజనేయులు, ఈవోపీఆర్డీ మూర్తి పాల్గొన్నారు

ముగిసిన గౌరీశంకర్ల ఉత్సవాలు



ధర్మవరంలో గౌరీశంకర్లను ఊరేగిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, జనవరి 21: మండలంలోని ధర్మవరంలో గౌరీశంకర్ల 87వ వార్షికోత్సవ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. 10 రోజులు పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించి గౌరీశంకర్ల విగ్రహాలను వైభవంగా రామభద్రరాజు చెరువులో నిమజ్జనం చేశారు. ఉత్సవాల్లో కరపకు చెందిన కళాకారుల శక్తివేషాలు, గోనాడకు చెందిన రాధాకృష్ణ వెంకటేశ్వర స్వామి వేషధారణలు, స్థానిక గంటాకృష్ణ బృందం శూలాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్పులతో పార్వతీ పరమేశ్వరులను విద్యుత్ దీపాల మధ్య ఊరేగించారు. నిమజ్జనోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయం భక్తులతో కిటకిట

గండేపల్లి, జనవరి 21: మండలంలో మురారి గ్రామ శివారులో మామిడితోటలో వెలిసిన కనకదుర్గమ్మ ఆలయం తిరునాళ్లను తలపించేలా భక్తులతో కిటకిటలాడింది. సంక్రాంతి ముగిసి మొదటి ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి భారీవాహనాల్లో వేలాదిగా భక్తులు రావడంతో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి వంటావార్పు చేసుకుని ఆనందంగా గడిపారు. సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ ఎన్.రామకృష్ణ సిబ్బందితో పోలీస్ గస్తీ నిర్వహించారు.

గ్రామాల్లో బైక్ ర్యాలీ

పెద్దాపురం, జనవరి 21: అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. కాండ్రకోట, సిరివాడ, మర్లావ, ఉలిమేశ్వరం, తూర్పుపాకలు గ్రామాలు జైశ్రీరామ్ నినాదంతో మారుమోగాయి. హిందూ సంఘాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

జగ్గంపేట, జనవరి 21: మండలంలోని రామవరం రంగవల్లి నగర్‌లోని అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు హిజ్ మినిస్ట్రీస్ అధినేతలు పాస్టర్ సురేంద్ర నీలు దంపతులు, పాస్టర్ సుదర్శన్, ప్రియ దంపతులు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం సాయంత్రం 7 బాధిత కుటుంబాలకు నగదు, బియ్యం ప్యాకెట్లు, కిరాణా, నిత్యవసర సరుకులు, వంట పాత్రలు, కూరగాయలు, రైస్ కుక్కర్లు, బకెట్లు, దుప్పట్లను అందజేశారు. దాతలను పలువురు అభినందించారు.

శ్రీధర్‌కు సన్మానం

ప్రత్తిపాడు, జనవరి 21: మండలంలోని ధర్మవరానికి చెందిన రెడ్డిపల్లి శ్రీధర్‌బాబు అమలాపురం ఎస్పీ టీం కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఎస్ఐ ఉద్యోగం సాధించడాన్ని పురస్కరించుకుని నూకాలమ్మ గుడి ప్రాంగణంలో శ్రీధర్‌బాబు, అతడి తల్లిదండ్రులు రాఘవమ్మ, సత్యనారాయణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీ వీర వెంకట నాట్యమండలి అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు, సీనియర్ కళాకారుడు దొడ్డిపట్ల సోమన్నదొర, ఆలయ కమిటీ సభ్యులు సానా తాతీలు, రెడ్డిపల్లి శ్రీను, గ్రామ పెద్దలు సిద్దా పెద్దకాపు, నానిపల్లి చంటి, భైరా రాజు, వై.గోవిందనాయుడు ఉన్నారు..

చంద్రబాబును కలిసిన నెహ్రూ

జగ్గంపేట, జనవరి 21: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మండపేట రా కదలిరా బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబును రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ మధురపూడి విమానాశ్రయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీలోకి చేరికలు, పార్టీని బలోపేతం చేస్తున్న నెహ్రూను అభినందించారు.